సాక్షి అనంతపురం

శనివారం । 24 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం రూరల్ కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.11 ప్రకారం అమ్మకాలు సాగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.2°/23.6°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

తుంగభద్ర డ్యాంలో పెరుగుతున్న నీటి మట్టం



బొమ్మనహాళ్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో 35 టీఎంసీల నీటిని నదిలోకి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎగువ నుంచి వరద వస్తుండడంతో డ్యాంలో క్రమక్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. గేటు మరమ్మతుల తర్వాత 70 టీఎంసీలు ఉన్న నీటి మట్టం శుక్రవారం నాటికి 83.249 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం తుంగభద్రకు 37,489 క్యూసెక్కుల వరద వస్తుండగా వివిధ కాలువలకు 9,488 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. డ్యాం నిండాలంటే మరో 20 టీఎంసీల నీరు రావాలి. మరో 10 రోజులు వరద ఇలాగే కొనసాగితే డ్యాం నిండుతుందని తుంగభద్ర బోర్డు అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రిలోకి కొండ చిలువ



ఆస్పత్రిలోకి వచ్చిన కొండ చిలువ

ఆత్మకూరు: మండల కేంద్రం ఆత్మకూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలోకి గురువారం రాత్రి కొండ చిలువ ప్రవేశించింది. ఆవరణలోనే కొద్దిసేపు అలానే ఉండటంతో డ్యూటీలో ఉన్న మహిళా సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తర్వాత ఆ కొండ చిలువ అక్కడి నుంచి వెళ్లిపోయింది. మళ్లీ శుక్రవారం ఓ పాము ఆస్పత్రి ఆవరణలోకి ప్రవేశించింది. వాచ్‌మెన్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎప్పుడు ఏ విషకీటకాల నుంచి అపాయం ముంచుకొస్తుందోనని వైద్య సిబ్బంది భయపడుతున్నారు.

- కళ్యాణదుర్గంలో శుక్రవారంరాత్రి నడిరోడ్డుపైకి కొండచిలువ రావడంతో స్థానికులు, వాహనదారులు బెంబేలెత్తిపోయారు.

వైద్య సిబ్బందికి రక్షణ కావాలి



“కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం హేయమైన చర్య. విధుల్లో ఉన్న మహిళా వైద్య సిబ్బందికి రక్షణ అవసరం. మండలాల్లో కూడా రాత్రి సమయంలో వైద్యులు, ఇతర సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. చికిత్స అవసరం లేనివారు, మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఆస్పత్రిలోకి చొరబడుతుంటారు. కోల్‌కతా లాంటి ఘటనలు మరెక్కడా జరగకూడదంటే ఆస్పత్రి వ్యవస్థలో మార్పులు రావాలి. ప్రతి స్త్రీని అమ్మగా, చెల్లిగా చూడాలి. హత్యాచార దోషులకు తగిన శిక్ష విధించాలి.

– డాక్టర్ తరుణ్‌సాయి, మెడికల్ ఆఫీసర్, శెట్టూరు



భద్రత అవసరం



మహిళలపై హత్యాచారాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ప్రాణాలు పోసే డాక్టర్లు, సిబ్బందికే రక్షణ కరువైతే ఎలా..? కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసింది. రోజూ ఏదో ఒక చోట అబల బలైపోతూనే ఉంది. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు దోషులను కఠినంగా శిక్షించాలి. మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది.”

– కవిత, స్టాఫ్‌నర్సు, కమ్యూనిటీ ఆస్పత్రి, పామిడి

నో సేల్



కొనుగోలు చేయకపోవడంతో టమాటాలను కక్కలపల్లి మండీ సమీపంలోనే పారబోసిన దృశ్యం



- ఇక్కడ ఆవేదనతో కనిపిస్తున్న రైతు పేరు చిన్నికృష్ణ. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామం. ఒకొక్కరికి రూ.300 ఇచ్చి 10 మంది కూలీలతో టమాట కోత కోయించాడు. 15 కిలోల చొప్పున 160 బాక్సుల టమాటాలను అనంతపురం రూరల్ కక్కలపల్లి మండీకి తెచ్చాడు. ఒక క్రేట్ (బాక్స్)కు రూ.22 ప్రకారం బాడుగ చెల్లించాడు. చిన్నికృష్ణ తెచ్చిన టమాట లాట్ దగ్గరకు రాగానే మండీ నిర్వాహకులు, వ్యాపారులు ఇలా చూసి అలా ‘ఇంటూ’ మార్క్ వేసి వెళ్లిపోయారు. ఇదేమని అడిగితే తేమ, మచ్చ ఉంది.. రవాణాకు ఇబ్బంది అంటూ ఎవరూ కొనడం లేదని చెప్పారు. చాలాసేపు ఎదురుచూసి చివరకు క్రేట్లను మళ్లీ వాహనంలో ఎక్కించి టమాటాలను బయట పారబోసి రిక్తహస్తంతో ఇంటికి చేరాడు.
- పది రోజులుగా చాలామంది రైతులకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురవుతోంది.

టమాట రైతు కుదేలు

- వర్షాలు, మచ్చల పేరిట కొనుగోలు చేయని వైనం
- మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్న మండీ నిర్వాహకులు
- అమ్ముడుబోక టమాటాలను రోడ్ల పక్కన పారబోస్తున్న రైతులు
- పట్టించుకోని కూటమి సర్కారు, ఉన్నతాధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఎన్నో వ్యయప్రయాసలకోర్చి టమాటాలను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతు ‘నో సేల్’ పేరుతో చిత్తవుతున్నారు. కొనుగోలుకు ఆసక్తిగా లేరంటూ మండీ నిర్వాహకులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు వేస్తున్న ‘నో సేల్’ ముద్రతో వారు కోలుకోలేకపోతున్నారు. జూలై రెండో వారంలో జిల్లాలో టమాట సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైంది. గరిష్ట ధర కిలో రూ.50 వరకు పలకడంతో ఆర్థికంగా గట్టెక్కుతామని రైతులు భావించారు. కానీ... ఇటీవల గరిష్ట ఉష్ణోగ్రతలతో పాటు వర్షాలు కురవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. కాయలకు మచ్చలు ఉన్నాయని, వర్షాల వల్ల తేమ ఉందని, కాయ సైజు తక్కువగా ఉందని కొనుగోలు చేయకుండా వేలంలో ‘ఇంటూ’ మార్క్‌వేసి ‘నో సేల్’ అంటూ రైతును దగా చేస్తున్నారు. దీంతో దిక్కుతోచని రైతులు చేసేది లేక తెచ్చిన సరుకు మళ్లీ వాహనంలో లోడ్ చేసి అలా రోడ్డు పక్కన పారబోసి వెళ్తున్నారు. మండీల్లో టమాట రైతుల పట్ల మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నా.. కూటమి సర్కారు, జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఉద్యానశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నారు.

640 మెట్రిక్ టన్నుల టమాటాల పారబోత

ఈ నెల 14న వర్షాలు మొదలయ్యాయి. 15వ తేదీ నుంచే కక్కలపల్లి మండీలో ‘నో సేల్’ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఎంతో శ్రమకోర్చి మండీకి తెస్తున్న సరుకు అమ్ముడుపోక పారబోస్తున్నారు. ఇలా గడిచిన తొమ్మిది రోజుల్లోనే ఏకంగా 640 టన్నుల టమాటా రోడ్డుపాలైంది. ఇటీవల రోజూ 3 వేల నుంచి 4,800 టన్నుల వరకు సరుకు వస్తోంది. గరిష్ట ధర కిలో రూ.20 వరకు పలుకుతోంది. ధరల పరిస్థితి కొంతవరకు బాగానే ఉన్నా.... ‘నో సేల్’ సరుకును కనీస ధరకు కూడా కొనుగోలు చేయకుండా వ్యవహరిస్తుండటంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. 640 టన్నులు అంటే సరాసరి ధరలతో లెక్క వేసుకున్నా రూ.కోటికి పైగా రైతులకు నష్టం వాటిల్లింది. ఇటీవల ఇలా రోజూ నో సేల్ కింద 40 నుంచి 80 టన్నులు చూపించగా... శుక్రవారం ఏకంగా 120 టన్నులు చూపించడం గమనార్హం. మార్కెట్‌లో ఇంత దారుణంగా మోసపోతున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కమీషన్ల కోసం తప్పితే తమ మేలు కోసం ఎవరూ ముందుకు రావడం లేదని, ఇటీవల రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేసినా ఫలితం శూన్యమని టమాట రైతులు వాపోతున్నారు.

వర్షాలు ప్రారంభమైన ఈ నెల 14 నుంచి కక్కలపల్లి మండీలో టమాట అమ్మకాలు/ నోసేల్ వివరాలు

తేదీ	మండీలో అమ్మకాలు (టన్నుల్లో)	అమ్ముడు పోని టమాట (టన్నుల్లో)	కిలోకు గరిష్ట ధర
15	3,750	40	రూ.23
16	4,500	70	రూ.25
17	4,200	75	రూ.21
18	3 వేల	65	రూ.22
19	4,800	80	రూ.22
20	3,750	75	రూ.21
21	2,250	50	రూ.22
22	3,750	65	రూ.20
23	3,800	120	రూ.20

పెట్టుబడి కూడా రాలేదు



నేను రెండు ఎకరాల్లో టమాట సాగు చేశా. కూలీలు, మందులు, ఎరువులు కలిపి దాదాపు రూ.1.40 లక్షల పెట్టుబడి వచ్చింది. 10 రోజుల క్రితం 15 కిలోల బాక్సు ధర రూ.300 నుంచి రూ.500 వరకు ఉండేది. ప్రస్తుతం వర్షాల కారణంగా రూ.100 నుంచి రూ.200 లోపే పలుకుతోంది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– జయరామిరెడ్డి, రైతు, ఆత్మకూరు.

రైతుల పరిస్థితి బాగోలేదు



పది రోజుల క్రితం వరకు టమాట ధరలు రైతులకు అనుకూలంగా ఉండేవి. ప్రస్తుతం వర్షాల కారణంగా కాయలు దెబ్బతిన్నాయంటూ కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. మార్కెట్‌లో ‘నో సేల్’ మార్క్ పడటంతో టమాటాలను రోడ్డు పక్కన పడేస్తున్నాం. రైతుల పరిస్థితి బాగోలేదు.

– పుల్లారెడ్డి, ఆత్మకూరు

ఆధిపత్యం.. ‘అధికార’ పైత్యం

- గ్రామసభలే వేదికలు
- మేం చెప్పినట్టే వినాలంటూ టీడీపీ నేతల హుకుం

బొమ్మనహాళ్/ శింగనమల/ బ్రహ్మసముద్రం : ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభలను అధికార తెలుగుదేశం పార్టీ నేతలు తమ ఆధిపత్య ప్రదర్శనకు వేదికలుగా మార్చేశారు. గ్రూపులుగా విడిపోయిన చోట్ల నాయకులు ఫర్నీచర్‌ను విసిరి కొట్టి.. అధికారులను నోటికొచ్చినట్లు దూషించారు. అధికారంలో కూటమి సర్కారు ఉందని.. తాము చెప్పినట్లే ఏ అధికారి అయినా నడుచుకోవాలని హుకుం జారీ చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీలు/సచివాలయాల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో సర్పంచ్ పరమేశ్వర, అధికారుల సారథ్యంలో ఏర్పాట్లు చేయగా.. టీడీపీ నాయకులు హనుమంతు అలియాస్ వట్టెప్ప, తిప్పేస్వామి అక్కడికి చేరుకుని హంగామా చేశారు. తమ అనుమతి లేకుండా గ్రామసభ ఎలా నిర్వహిస్తారంటూ కుర్చీలను కాళ్లతో తన్ని రోడ్డుపైకి విసిరేశారు. అడ్డుకోబోయిన గ్రామ సభ స్పెషలాఫీసర్, మండల ఇంజినీర్ జగదీష్, మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మిలపై నోరుపారేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోయింది కదా.. మా ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొనాల్సిన అవసరం నీకేముందంటూ సర్పంచ్ పరమేశ్వరతో వాగ్వాదానికి దిగారు. ఘటనపై సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



నేమకల్లు గ్రామసభలో అధికారులతో గొడవకు దిగిన టీడీపీ నాయకుడు తిప్పేస్వామి

- శింగనమల మండలం ఆకులేడు గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహణ కోసం టీడీపీ నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. దీంతో ఇరు వర్గాల వారికీ తహసీల్దార్ బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది నచ్చజెప్పారు. అయినా ఒక దశలో పరస్పర దాడులు చేసుకోవడానికి సిద్ధమవగా పోలీసులు సకాలంలో స్పందించి నిలువరించారు.
- బ్రహ్మసముద్రం మండలంలోని బ్రహ్మసముద్రం, భైరసముద్రం, వేపులపర్తి, పడమటి కోడిపల్లి తదితర గ్రామాల్లో జరిగిన ఉపాధి గ్రామ సభల్లో టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీనివాసులు అధికారులపై విరుచుకుపడ్డారు. తమ పార్టీ చెప్పినట్టే నడుచుకోవాలని.. గత ప్రభుత్వంలో మాదిరిగా అయితే కుదరదని.. అధికారులు పద్ధతి మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించారు.

కళ్లు మూసుకుంటాం.. కబ్జా చేసుకోండి!

- రాయదుర్గం బీటీపీ లేఅవుట్‌లోని పేదల స్థలాల్లో ‘పచ్చమూకల’ పాగా

పేదల స్థలాలపై పెద్దల కన్ను పడింది. వాటిని ఎలాగైనా కబ్జా చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. అడ్డొస్తే అంతుచూస్తాం అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. సర్కారు మాది.. ప్రభుత్వ స్థలాలన్నీ మావే అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తున్న తీరు విస్మయపరుస్తోంది. అడ్డుకోవాల్సిన అధికారులకు బదిలీ ఫీవర్ పట్టుకుంది. నేతల వద్ద మార్కులు కొట్టేసేందుకు ‘మేం కళ్లు మూసుకుంటాం.. మీరు కబ్జా చేసుకోండి’ అన్నట్టు సంకేతాలిచ్చేశారు. అంతే.. రాయదుర్గం శివారులోని బీటీపీ లేఅవుట్‌లో రెండు వారాలుగా కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉంది.

రాయదుర్గం: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2006లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం బీటీపీ హైవేకు ఆనుకుని 13.25 ఎకరాలు కొనుగోలు చేసి లేఅవుట్ వేశారు. అందులో 30, 40 అడుగులతో రోడ్లు వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల కోసం 50 సెంట్లు (అర ఎకరం) కేటాయించారు. మిగిలిన విస్తీర్ణంలో 1,272 ప్లాట్లు వేసి ఒక్కో లబ్ధిదారుకు 2.50 సెంట్ల చొప్పున పంపిణీ చేశారు. అయితే చాలామంది ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ.. ఇదివరకే కేటాయించిన లబ్ధిదారుల స్థానంలో పేర్లు మార్చి కొందరికి పట్టాలు అందజేసింది. పలుకుబడి మేరకు మరికొందరు నకిలీ పట్టాలు సృష్టించుకుని అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఈ లేఅవుట్ పక్కనే ప్రైవేటు వెంచర్లు వెలిశాయి. వాటిలో సెంటు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో కబ్జాదారుల కన్ను బీటీపీ లేఅవుట్ స్థలాలపై పడింది. నిరుపేదలకు దక్కాల్సిన స్థలాలన్నీ వారి కబంధ హస్తాల్లోకి చేరాయి. రిజర్వు స్థలం సైతం ఆక్రమణకు గురైంది. రెండు వారాలుగా రాత్రి, పగలు తేడా లేకుండా రెండు జేసీబీలతో పనులు చేస్తున్నారు. ఒక్కొక్కరు 4 నుంచి 5 సెంట్ల చొప్పున స్థలాలు కబ్జా చేసి పునాదులు నిర్మించుకుంటున్నారు. మరికొందరు కబ్జా చేసిన ప్లాట్లను ఇతరులకు అమ్మి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలను సంరక్షించాల్సిన అధికారులు తాము కోరుకున్న చోటకు బదిలీ అయ్యేందుకు ఆక్రమణదారులైన నేతలకు ‘జీ హుజూర్’ అంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రాయదుర్గం బీటీపీ లేఅవుట్‌లోని రిజర్వ్ స్థలంలో పునాదులు తీయిస్తున్న అక్రమార్కులు

ఆక్రమణలను అడ్డుకుంటాం

బీటీపీ లేఅవుట్‌ను పరిశీలించి ఆక్రమణలను గుర్తించి అడ్డుకుంటాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుకుంటాం. రిజర్వు సైట్‌లో ఒక్క నిర్మాణమూ చేపట్టడానికి వీల్లేదు. దీనిపై సమగ్ర నివేదిక కోరుతాం. నకిలీ పట్టాలు కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. త్వరలో తహసీల్దార్ నియామకం చేపట్టేలా కృషి చేస్తాం.

– శివ నారాయణశర్మ, జాయింట్ కలెక్టర్

మమ్మల్ని ఆపేదెవడ్రా..!

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నేతల పనులకు అడ్డు లేకుండాపోతోంది. ఏం చేసినా తమను అడిగేవారు లేరని రెచ్చిపోతున్నారు. తాజాగా ఆత్మకూరు మండలం పి.సిద్దరాంపురంలో గ్రామ కంఠానికి చెందిన ప్రభుత్వ భూమిని టీడీపీ నేతలు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం జేసీబీని పెట్టి ముళ్ల చెట్లను తొలగించారు. పి.సిద్దరాంపురం గ్రామం సర్వే నంబర్ 524లో 91.62 ఎకరాల భూమి ఉంది. ఈ సర్వే నంబర్ లోని భూమిని గత టీడీపీ ప్రభుత్వంలో కొందరు తెలుగు తమ్ముళ్లు ఆక్రమించారు. కొందరు గ్రామస్తులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 2022లో తహసీల్దార్ తిప్పేస్వామి సదరు గ్రామ కంఠం భూమిని రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు రాసి పంపారు. దీంతో ఆక్రమణదారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆ ప్రభుత్వ భూమిని ఎవ్వరూ స్వాధీనం చేసుకోకూడదని, అది ప్రభుత్వ భూమి అని జిల్లా రెవెన్యూ అధికారులకు నోటీసు జారీ చేసింది.

అధికారం అడ్డు పెట్టుకుని..

పి.సిద్దరాంపురంలో శుక్రవారం గ్రామసభ జరుగుతుండగానే.. ఆక్రమణదారులు జేసీబీతో ప్రభుత్వ స్థలంలోని ముళ్ల చెట్లను తొలగించారు. దాదాపు నాలుగెకరాలు కబ్జా చేసేందుకు సిద్ధపడ్డారు.

వాటర్‌ప్లాంట్ తొలగింపు

గ్రామస్తులు తాగునీటి కోసం చందాలు వేసుకుని గత ప్రభుత్వ హయాంలో ఒక సెంటు విస్తీర్ణంలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత టీడీపీ నేతల ఒత్తిళ్లతో అది ప్రభుత్వ స్థలమని, పంచాయతీ అనుమతి లేకుండా ప్లాంట్ ఎలా నిర్మిస్తారని అధికారులు ఫిల్టర్ మెషీన్‌ను తొలగించారు. మరి ఇప్పుడు నాలుగెకరాలు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

దేదీప్యమానం



కృష్ణాష్టమిని పురస్కరించుకుని అనంతపురం శివారులోని ఇస్కాన్ మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. రంగు రంగుల విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం కాంతులీనుతోంది. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి పక్కనున్న ఈ ఆలయాన్ని ప్రయాణికులు, ప్రజలు తిలకించి అమితానందం పొందుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

సకాలంలో ఈ- క్రాప్ నమోదు చేయాలి : డీఏఓ


రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

పెద్దవడుగూరు: రైతులు సాగు చేసిన పంటల వివరాలు పక్కాగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రతి పంటనూ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం చిన్నవడుగూరు వద్ద ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఐటీఐ ప్రవేశాలకు మూడో విడత కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన తొలి, రెండవ విడతల కౌన్సెలింగ్‌లో మిగిలి పోయిన సీట్లకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ నెల 26లోగా iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏ ఐటీఐ చేరాలనుకున్నారో అదే ఐటీఐని ఆన్‌లైన్‌లో ఎంచుకోవచ్చునన్నారు. దరఖాస్తు తర్వాత దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల ప్రవేశాలకు ఈ నెల 29న, ప్రైవేట్ ఐటీఐల్లో ఈ నెల 30న కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

కనీస సౌకర్యాలూ లేవు



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కనీస సౌకర్యాలు ఎంత మాత్రమూ లేవు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. రోగుల ప్రాణాలు కాపాడేందుకు రేయింబవళ్లు శ్రమించే మాకే తాగునీరు అందుబాటులో ఉండడం లేదు. గంటల తరబడి విధులు నిర్వర్తించే సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకోవాలన్నా కుదరదు. విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. ఎమర్జెన్సీ, ఏఎంసీలో విధులు నిర్వర్తించే సమయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం.

– డాక్టర్ వివేక్, పీజీ ఫస్ట్ ఇయర్



అనుక్షణం భయపడాల్సి వస్తోంది



ప్రశాంత వాతావరణంలో రోగులకు సేవ చేసే అవకాశం లేకుండా పోతోంది. ఎవరు ఎప్పుడు ఎలా రియాక్ట్ అవుతారో అర్థం కాకా ప్రతి క్షణమూ భయడాల్సి వస్తోంది. రాత్రి సమయాల్లో మద్యం మత్తులో చికిత్సకు వచ్చేవారితో మరీ కష్టం. వారికి ఏది చెప్పినా ఇబ్బందిగానే ఉంటోంది. మత్తులో వారి ప్రవర్తన చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. ఇదే విషయాన్ని పోలీసులకు తెలిపాం. రాత్రి సమయాల్లో ఓసారి ఆస్పత్రిని సందర్శించి వెళ్లాలని కోరాం. ఆస్పత్రికి వాచ్‌మెన్ కూడా లేడు.

– డాక్టర్ సబిహా సుల్తానా, ఆత్మకూరు పీహెచ్‌సీ

భద్రత, వసతులు కల్పించాల్సిందే..

- జీఎంసీ ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు తేల్చి చెప్పిన ఆప్ జూడాలు
- సర్దుబాటు చేస్తాం.. రోగుల సేవల్లో పాల్గొనండంటూ యాజమాన్యం అభ్యర్థన


జూడాలతో మాట్లాడుతున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు


గుత్తిలో నిరసన ర్యాలీ చేస్తున్న గేట్స్ విద్యార్థులు

అనంతపురం మెడికల్: భద్రత పరంగానూ.. మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టమైన హామీనిచ్చే వరకూ సమ్మె విరమించేది లేదని ఆప్ జూడా అధ్యక్షుడు డాక్టర్ హరికిరణ్ స్పష్టం చేశారు. శుక్రవారం సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆప్ జూడా అధ్యక్షుడు హరికిరణ్, నాయకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పవన్‌కుమార్, తదితరులతో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల (జీఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, రేడియాలజిస్టు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులు తమకు విశ్రాంతి గదులతో పాటు తాగునీటి సదుపాయం, క్యాంటీన్ వసతి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో విశ్రాంత గదులకు సంబంధించి ప్రస్తుతానికి ఎమర్జెన్సీ వార్డు పై భాగం, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్ పై భాగంలో ఉన్న గదులను వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. మౌలిక సదుపాయాల కల్పన అంశానికి సంబంధించి ముగ్గురు హెచ్ఓడీలతో కూడిన త్రిసభ్య కమిటీను ఏర్పాటు చేస్తున్నామని, వారితో చర్చించి తదుపరి నిర్ణయానికి రావాలని తెలిపారు. దీనిని జూనియర్ డాక్టర్లు వ్యతిరేకిస్తూ సమ్మె యథావిధిగా కొనసాగిస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, శుక్రవారం ఉదయం ఆస్పత్రి ఆవరణలోని శిబిరంలో నిరసన తెలుపున్న జూడాలతో జీఎంసీ ప్రిన్సిపాల్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె విరమించారని, ఇలాంటి తరుణంలో ఇక్కడ కూడా సమ్మె విరమించి విధులకు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పీజీ వైద్య విద్యార్థులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి

గుత్తి: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హతమార్చిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలంటూ గుత్తిలో శుక్రవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, ఆర్డీటీ సిబ్బంది చేపట్టిన ఈ ర్యాలీ స్థానిక అనంతపురం రోడ్డు శివారు నుంచి గాంధీ సర్కిల్ వరకూ కొనసాగింది. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి హతురాలికి నివాళులర్పించారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు.

కఠిన చట్టాలు తీసుకురావాలి


జూడాలకు మద్దతుగా మాట్లాడుతున్న క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత

అనంతపురం మెడికల్: కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన దుర్ఘటనలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చట్టాలను తీసుకురావాలని ప్రభుత్వాన్ని ఆల్ ఆంధ్రప్రదేశ్ క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గౌస్‌పీరా, సహాయాధ్యక్షురాలు లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. అత్యాచారం, హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో సమ్మె చేస్తున్న ఆప్ జూడాలకు శుక్రవారం వారు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి వాజిద్‌బాషా, నగరాధ్యక్షుడు నాగభూషణం, నాయకులు ఇర్ఫాన్, జయచంద్ర, ఆదిలక్ష్మి, షెక్షావలి, శంకర్, పరమేశ, శివ, తదితరులు పాల్గొన్నారు.

జలాలపురంలో ఇసుక డంప్


జలాలపురం సమీపంలో తోటలో ఏర్పాటు చేసిన ఇసుక డంప్

శింగనమల: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పాలసీని అందుబాటులోకి తెస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన కూటమి పెద్దలు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక ఊసే ఎత్తడం లేదు. పైగా టీడీపీ నాయకులు ఇసుకను అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకునే వెసులుబాటు ఇచ్చింది. ఇందుకు శింగనమల మండలం పి.జలాలపురం సమీపంలోని తోటలో ఏర్పాటు చేసిన ఇసుక డంప్ అద్దం పడుతోంది. టీడీపీ నాయకులు కొందరు ఏకమై పి.జలాలపురం సమీపంలోని వంక నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి తోటలో డంప్ చేశారు. అక్కడి నుంచి రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా అక్రమంగా మరో ప్రాంతానికి తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజులుగా సాగుతున్న ఈ అక్రమ దందాపై పూర్తి స్థాయి సమాచారం పోలీసులు, సెబ్ అధికారులు వద్ద ఉంది. అయినా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో సలకంచెరువు, ఇరువెందల, రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి గ్రామాల నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో పోలీసులు, సెబ్ అధికారులు హంగామా చేసి, టిప్పర్లను, జేసీబీలను అదుపులోకి తీసుకున్నారు. అయితే కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బత్తలపల్లి: వ్యవసాయ పరికరాలు అపహరించుకెళ్లిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు. మండలంలోని గంటాపురం నివాసి నాదెండ్ల రంగస్వామి పొలంలో మూడు రోజుల క్రితం డ్రిప్ పైపులు చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్ నేతృత్వంలో లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో ముగ్గురిని శుక్రవారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన వడ్డే భూపతిరాజు, బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లికి చెందిన సిద్ద రామమోహనరెడ్డి, అనంతపురంలోని వినాయక్‌నగర్‌కు చెందిన పల్లా జగదీశ్వర్ ఉన్నారు. వ్యసనాలకు బానిసైన వీరు తమ జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం పొలాల్లో అమర్చిన డ్రిప్ పరికరాలను అపహరించుకెళ్లి గుజరీకి విక్రయించి సొమ్ము చేసుకునేవారిగా నిర్ధారణ అయింది. వీరి ఉంచి ఆరు కట్టల ఆన్‌లైన్ డ్రిప్ పైపులు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: స్థానిక నందలపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద చెట్టుకు టవాల్‌తో ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న సీఐ లక్ష్మీకాంతరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. వారం రోజుల క్రితం ఉరి వేసుకున్నట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతదేహం కుళ్లి, బాగా ఉబ్బిపోయి మృతుడు ఎవరైంది గుర్తు చిక్కని స్థితిలో ఉంది. మృతుడి దుస్తుల్లో ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులోని నంబర్ల ఆధారంగా మృతుడు ఎవరైంది నిర్ధారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణ సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ


గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

గార్లదిన్నె: గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్ద పీట వేతసిందని, ఈ క్రమంలో గ్రామసభల ద్వారా సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం గార్లదిన్నెలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. తాగునీటి సమస్యలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలకు సంబంధించి శ్మశాన వాటిక దారులు, వాటి పునరుద్ధరణ, సీసీ రోడ్లు, వృద్ధాప్య పింఛన్లు, నూతన రేషన్ కార్డులు, వీధి దీపాలు, గృహ నివాసాల మధ్యలో చెత్త తొలగింపు తదితర పనులకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా సమష్టిగా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ... గ్రామ సభల్లో పనులకు ఆమోదం పొంది పంచాయతీ కార్యదర్శి, డీపీఓ ద్వారా జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపితే ఆయా పనులకు నిధులు కేటాయిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, డీపీఓ ప్రభాకరరావు, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, తహసీల్దార్ ఈరమ్మ, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు

గ్రామసభలో పాల్గొనేందుకు వచ్చిన ఇన్‌చార్జ్ కలెక్టర్ తొలుత తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సీసీ కెమెరాలు అనునిత్యం పనిచేసేలా చూడాలని సూచించారు. పీహెచ్‌సీలో రోజు వారీ ఓపీపై ఆరా తీశారు. అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, మంజుల, హనీషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ రత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న గురువుల కృషిని గుర్తిస్తూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో వేర్వేరుగా ఉపాధ్యాయ రత్న పురస్కారాలను 'సర్వేజనా సుఖినోభవంతు' సాంస్కృతిక, సాహిత్య సంస్థ అందజేయనుంది. ఈ మ ఏరకు సంస్థ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేవలం విద్యారంగమే కాకుండా వివిధ రంగాలలో గురువులుగా రాణిస్తున్న వారు అవార్డులకు అర్హులు. అర్హులైన వారు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులను 'సర్వేజనా సుఖినో భవంతు, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామాకు చేరేలా పంపాలి. ఎంపికైన వారికి వచ్చే నెల 8న హైదరాబాదులో సత్కరించి, పురస్కారాలు అందజేస్తారు. పూర్తి వివరాలకు 96523 47207లో సంప్రదించవచ్చు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


నాగేంద్ర (ఫైల్)

బొమ్మనహాళ్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువ రైతు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం దేవగిరి గ్రామానికి చెందిన వడ్డే నాగేంద్ర (26)కు భార్య పవిత్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొండల్లో రాళ్లు కొట్టే పనితో పాటు తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాళ్లు కొట్టి వచ్చిన నాగేంద్ర... సాయంత్రం పొలంలో సాగు చేసిన వరి పంటను చూసేందుకు వెళ్లాడు. అక్కడ బోరు మోటారు వద్ద సర్వీస్ వైర్ తెగి ముళ్లకంచెపై పడి ఉంది. విషయాన్ని గమనించకుండా ముళ్ల కంచెను దాటే ప్రయత్నంలో పొరబాటున చేతితో తాకడంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న పక్క పొలాల రైతులు గమనించి కుటుంబసభ్యులతో కలసి బళ్లారికి నాగేంద్రను తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

పాము కాటుతో యువకుడు...


చిన్నరాయుడు (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని కొంగనపల్లికి చెందిన చిన్నరాయుడు (30) పాముకాటుతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం వర్షంలో బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆయనను పాము కాటు వేసింది. ఆ సమయంలో చుట్టుపక్కల గాలించినా ఏమీ కనిపించకపోవడంతో ఇంటికి చేరుకున్న ఆయన భోజనం ముగించుకుని తన పనుల్లో నిమగ్నమయ్యాడు. కాసేపటి తర్వాత అస్వస్థతకు గురి కావడంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వెంటనే గుత్తికి తీసుకెళ్లి నాటు వైద్యం చేయించి ఇంటికి పిలుచుకొచ్చారు. రెండు రోజుల పాటు ఇంట్లోనే ఉన్న చిన్నరాయుడు... ఎంతకూ తగ్గని కాలి నొప్పి నయం కావాలంటూ పులివెందుల సమీపంలో ఉన్న అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం బయలుదేరాడు. మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతిచెందాడు.ఆయనకు భార్య నాగవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మహిళ బలవన్మరణ


గుర్తు తెలియని మహిళ మృతదేహం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎన్ఎస్‌గేట్ వద్ద గుర్తు తెలియని మహిళ గురువారం అర్ధరాత్రి సమయంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో గూడ్స్ రైలు కింద పడేందుకు సిద్ధంగా ఉన్న మహిళను లోకో పైలెట్ గమనించి అప్రమత్తమై గూడ్స్‌ను ఆపేశాడు. అప్పటికే ఇంజన్ ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అనంతరం ఆమెను నాగసముద్రం రైల్వే గేట్ వద్దకు చేర్చి, గేట్‌మెన్ల సాయంతో 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేరేలా చర్యలు తీసుకున్నాడు. అయితే ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఘటనపై హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27641, 94412 38182కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

'ఫెడ్‌ఎక్స్' పేరిట నేరాలు

- అపరిచిత కాల్స్‌కు స్పందించొద్దు : ఎస్పీ

అనంతపురం సెంట్రల్: ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ పేరుతో జరుగుతున్న నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీష్ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'అపరిచితులు విదేశాల నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పి మాటలు కలుపుతారు. ఆ కాల్ కట్ చేశాక మరో అపరిచిత నంబర్ నుంచి ఫెడ్ ఎక్స్ కొరియర్ సర్వీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని పరిచయం చేసుకుంటారు. మీ పేరుతో ఒక పార్సిల్ వచ్చిందని చెప్పి నమ్మిస్తారు. నాకు కొరియర్ రావాల్సిన వస్తువులేవీ లేవని చెప్పినా.. అపరిచిత వ్యక్తులు మీ పేరు, ఫోన్ నంబర్ చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తారు. ఆ తర్వాత ఈ కొరియర్లో డ్రగ్స్, ఎక్స్‌ప్లోజివ్ వస్తువులు ఉన్నాయని భయభ్రాంతులకు గురిచేసి.. ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు సేకరించి మీపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తారు. తర్వాత ముంబై సైబర్ పోలీసులమని చెప్పి స్కైప్‌కాల్స్‌లో మాట్లాడుతూ మీకు సంబంధించిన కీలకమైన వివరాలన్నీ రాబడుతారు. ఫైన్ కట్టాలంటూ అకౌంట్‌లలో ఉన్న డబ్బులు మొత్తం లాగేసుకుంటారు. ప్రజలు ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి. వెంటనే సమీప పోలీసుస్టేషన్, కుటుంబ సభ్యులతో చర్చించాల'ని ఎస్పీ సూచించారు. ఎట్టి పరిస్థితిలో వ్యక్తిగత విషయాలు ఎవరితోనూ పంచుకోకూడదని తెలిపారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని కోరారు.

బోడిసానిపల్లిలో కూలిన మిద్దె

- నలుగురికి తీవ్ర గాయాలు


కూలిన మిద్దె

వజ్రకరూరు: మండలంలోని బోడిసానిపల్లిలో శుక్రవారం రాత్రి మట్టి మిద్దె కూలింది. ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు మిద్దె పూర్తిగా తడిసింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం ముగించుకుని నిద్రకు ఉపక్రమిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న పార్వతి, రాజేష్, భాగ్యలక్ష్మి, ఉదయ్‌కుమార్‌ను గ్రామస్తులు వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా... ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ నరేష్... బోడిసానిపల్లికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.


తీవ్రంగా గాయపడిన భాగ్యలక్ష్మి, ఉదయ్‌కుమార్

కార్ల షోరూంలో దొంగల హల్‌చల్

- మూడు రోజుల కిందట సోములదొడ్డి సమీపంలో ఘటన


సీసీ కెమెరాలో రికార్డయిన దొంగల కదలికలు

రాప్తాడు రూరల్: కత్తులు చేతబట్టిన ఇద్దరు దొంగలు అనంతపురం నగర శివారులోని ఓ కార్ల షోరూంలో అర్ధరాత్రి హల్‌చల్ చేయడం కలకలం రేపుతోంది. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలోని నెక్సా షోరూంలో అర్ధరాత్రి ఇద్దరు దొంగలు ప్రవేశించి కలియ తిరిగారు. చేతుల్లో కత్తులు పట్టుకుని వివిధ గదుల్లో సోదాలు చేశారు. కత్తుల లాంటి ఆయుధాలు పట్టుకుని రావడం చూస్తుంటే పొరబాటున ఎవరైనా ఉంటే హతమార్చేందుకు కూడా వెనుకాడరనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దొంగలకు నగదు, విలువైన వస్తువులేవీ దొరకపోవడంతోనే షోరూం నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

క్లుప్తంగా

ఎస్కేయూ వీసీకి సన్మానం



ఇన్‌చార్జ్ వీసీ అనితను సన్మానిస్తున్న క్లాస్‌మేట్స్

అనంతపురం సెంట్రల్: శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ అనితను సహచర విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. 1981లో పామిడిలో టీసీజీహెచ్ స్కూల్‌లో వీసీ అనితతో కలిసి పదో తరగతి చదువుకున్న వారిలో దాదాపు 35 మంది హాజరయ్యారు. న్యూ ఢిల్లీలో ప నిచేస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సాయి మనోహర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నాడు విద్యార్థి దశలో జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. చాంద్‌బాషా, సీనియర్ న్యాయవాది రాజశేఖర గౌడ్ దంపెట్ల, నందకుమార్, మురళీ, రాజు గడ్డాలే, జిలాన్, రవికుమార్ జవళికర్, తిరుపాల్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.

31న శివాలయంలో వేలం పాట

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో లైటింగ్ డెకరేషన్, పూల అలంకరణ తదితర హక్కుల కోసం ఈనెల 31న ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ సాకే రమేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్టి ఫంక్షన్ హాలు, కల్యాణ మండపంతో పాటూ శుభకార్యాలు నిర్వహించుకునేందుకు, సప్లయర్స్ సామాను బాడుగకు ఇచ్చేందుకు రెండేళ్ల కాళ్ల పరిమితితో ఉదయం 10.30 గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు అధికారులను సంప్రదించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



రేష్మ

కనగానపల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో (కేజీబీవీ) చదివిన రేష్మా ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు పాఠశాల ఎస్‌ఓ నరసమ్మ తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బద్దలాపురం గ్రామానికి చెందిన అక్కులప్ప కూతురు రేష్మా పదో తరగతి పరీక్షల్లో 522 మార్కులు సాధించిందన్నారు. ట్రిపుల్ ఐటీ కళాశాలలకు దరఖాస్తు చేసుకోగా నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు వచ్చినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం సెంట్రల్: ప్రభుత్వ సర్వజనాసుపత్రి సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) మృతి చెందాడు. మృతుడు పింక్ కలర్ షర్ట్ ధరించి, ఎడమ చేతి, దవడపై పుట్టు మచ్చ ఉందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ శ్రీకాంత్ తెలిపారు.

తైక్వాండోలో ప్రతిభ

అనంతపురం టవర్‌క్లాక్: విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో ఈనెల 18న జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ తైక్వాండో పోటీల్లో లక్ష్మీ సెనర్జీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కోచ్ రామాంజనేయులు తెలిపారు. అండర్–68 విభాగంలో గుజ్జల యోగ చర్విత బంగారు పతకం సాధించిందన్నారు. అలాగే ఇటీవల తాడిపత్రిలో జరిగిన సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో శ్రీభవిష్య, పార్థు బంగారు పతకాలు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో ఢిల్లీలోని ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు వీరు ఎంపికైనట్లు వెల్లడించారు.

దోమకాటు నివారణ చర్యలు



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా నగరంలోని నడిమివంక, మరువవంక, తదితర కుంటల్లో డ్రోన్‌ల ద్వారా మలాథియాన్ మందు పిచికారీ చేయించేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమయ్యారు. శుక్రవారం మరువవంకలో డ్రోన్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఆర్‌డీ, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. సాధారణంగా కుంటల్లో మలాథియన్ పిచికారీ చేయడానికి వీలుండదన్నారు. ఇటువంటి తరుణంలో డ్రోన్ సహాయంతో పిచికారీ చేసే సదుపాయాన్ని పరిశీలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో పాలకవర్గంతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. వజ్రకరూరు ఇన్నోవేషన్ లిమిటెడ్ ఏజెన్సీ డ్రోన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. 20 నిమిషాల పాటు డ్రోన్ స్ప్రే జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ అబూసలేహ, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

అనంతపురం సెంట్రల్: ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నాల్గవ పట్టణ ఎస్‌ఐ నాగమధు తెలిపారు. కంబదూరు మండల కేంద్రానికి చెందిన వానరస నరసింహులు గత కొన్నేళ్లుగా అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే వాడు. చంద్రబాబు కొట్టాల ఆటోస్టాండ్ వద్ద ఉన్న వానరస నరసింహులును ఎస్‌ఐ నాగమధు, సిబ్బంది అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

భద్రత పెంచాలి



“ కోల్‌కత్తాలో వైద్యురాలి హత్య ఘటన అనంతరం బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. వైద్య, ఆరోగ్య మహిళా సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రత కట్టుదిట్టం చేయాలి. రాత్రి వేళల్లో విధులకు హాజరుకావాలంటే ఇబ్బందిగా ఉంది. ఆత్మకూరులోని ఆస్పత్రి వద్ద రాత్రి వేళల్లో పోలీసులు గస్తీలు ముమ్మరం చేయాలి. మా ఆస్పత్రిలోకి రాత్రి సమయాల్లో పాములు వస్తున్నాయి. భయం భయంగా డ్యూటీ చేస్తున్నాం. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యుల రక్షణకు పకడ్బందీగా చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– అరుణ, స్టాఫ్‌నర్స్, ఆత్మకూరు



వైద్యులకు రక్షణ కల్పించాలి



ఆపదలో ఉన్న క్షతగాత్రులకు వైద్యం చేసి, ప్రాణాలు కాపాడుతున్నాం. ఒక్కోసారి మా కుటుంబం, పిల్లలకు దూరం కావాల్సి వస్తుంది. అయినా వైద్య సేవలే పరమావధిగా విధులు నిర్వర్తిస్తున్నాం. ఇలా సేవలందిస్తున్న వైద్యులపై దాడులు చేయడం దుర్మార్గం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాకు రక్షణ కల్పించక పోతే మేము ఎలా విధులు నిర్వర్తించగలం. దేశవ్యాప్తంగా నిత్యం హత్యాచారాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ప్రాణాలు పోసే వైద్య, ఆరోగ్య సిబ్బందికి భద్రత పెంచాలి. ”

– సుజాత, స్టాఫ్‌నర్స్, ఆత్మకూరు



పెన్నహోబిలం వద్ద కనువిందు చేస్తున్న తుంగభద్ర జలాలు



పెన్నహోబిలం నుంచి కనుచూపు మేరలో ఆహ్లాదకరంగా ఉన్న ప్రాంతం



చెక్ డ్యాం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న యువకులు



కోనేరు నిండా అల్లుకున్న ఆకు

● ఆహ్లాదం.. ఆధ్యాత్మికం

ఉరవకొండ నియోజకవర్గంలోని పెన్నహోబిలం పర్యాటకులు, భక్తులతో సందడిగా మారింది. లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సుల కోసం ప్రజలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ఆలయం సమీపంలోని చెక్ డ్యాంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నీటిలో జలకాలాడుతున్నారు. అక్కడే ఉన్న కోనేరు సందర్శకులను ఆకట్టుకుంటోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా నీటిలోకి దిగి ఫొటోలు తీసుకుంటున్నారు. ప్రశాంత వాతావరణం, పచ్చని చెట్లు ఉండటంతో పర్యాటకుల ఆనందానికి అవధుల్లేవు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



నృసింహుడికి మొక్కుతున్న భక్తుడు

ఘనంగా నేషనల్ స్పేస్ డే



పోస్టర్లు చూపుతున్న కేంద్రియ విద్యాలయం విద్యార్థులు

అనంతపురం సెంట్రల్: కేంద్రియ విద్యాలయం (ఎస్కేయూ క్యాంపస్)లో నేషనల్ స్పేస్ డేను ఘనంగా జరుపుకున్నారు. చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రుడిపై అడుగిడిన సందర్భంగా శుక్రవారం నేషనల్ స్పేస్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మార్కండేయులు తెలిపారు. ఇస్రో సాధించిన విజయాలను సామాజిక మాధ్యమాల ద్వారా ఐఐఏపీ (బెంగుళూరు) ప్రొఫెసర్ శశికుమార్ విద్యార్థులకు తెలియజేశారు.

పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న ఎంఎస్‌ఎస్ సేవా సంస్థ అధ్యక్షురాలు మహబూబీ తదితరులు

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌కు చెందిన సామిల్, హారతి దంపతుల కుమార్తె పెళ్లికి ఎంఎస్‌ఎస్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రుద్రంపేట ఎంపీటీసీ–4 మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్‌వలి శుక్రవారం పెళ్లి కానుక అందజేశారు. ఎంఎస్‌ఎస్ సేవా సంస్థ పేదల అభివృద్ధికి పని చేస్తుందన్నారు. వృద్ధులు, వికలాంగులకు నెలకు రూ.100 పింఛన్ అందజేయడంతో పాటు పేద జంటలకు పెళ్లి కానుక అందజేస్తున్నామని పేర్కొన్నారు. పెళ్లి కానుకలో భాగంగా 100 కేజీల బియ్యంతో పాటు పట్టువస్త్రాలు, ఇతర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, అక్కమ్మ, ఖాజా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ప్రకాశం పంతులు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం కార్పొరేషన్: టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన ప్రకాశం పంతులు మద్రాసు రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా 13 నెలల పాటు పని చేయడం గర్వకారణమన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి తుపాకీకి ఎదురుగా నిలబడి.. కాల్చండి అంటూ తన గుండెను చూపించిన ధైర్యశాలి అని కొనియాడారు. రాష్ట్రానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఒంగోలు జిల్లాకు ప్రకాశం జిల్లాగా పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, కార్పొరేటర్లు బాలాంజనేయులు, కమల్‌భూషణ్, అబూసలేహ, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి

రాప్తాడు/ఆత్మకూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాప్తాడు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనులు, తాగునీరు, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం, శ్మశాన వాటిక, మురుగు నీటి కాలువలు, రోడ్లు, వీధి దీపాలు తదితర అంశాలపై గ్రామసభ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ అనురాధ, ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ విజయ కుమారి, ఏపీఓలు సావిత్రి, ఓబన్న తదితరులు పాల్గొన్నారు. ఇక ఆత్మకూరు మండల వ్యాప్తంగా తూతూమంత్రంగా గ్రామసభలు జరిగాయి. ప్రజా ప్రతినిధులను కాదని.. టీడీపీ నేతలను స్టేజ్‌పై కూర్చోబెట్టి సమావేశాలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని వాటిని అభివృద్ధి చేసేందుకు గ్రామ సభలు నిర్వహించామన్నారు.



రజియాభానును స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

రోగి సహాయకులే దిక్కు..!

ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు రజియాభాను. కాలు ఫ్యాక్చర్ కావడంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థో వార్డులో అడ్మిట్ అయ్యింది. కాగా శుక్రవారం వైద్యులు ఎక్స్‌రే తీసుకురావాలని సూచించారు. అయితే రజియాభానును ఎక్స్‌రే కోసం తీసుకెళ్లాలని ఆర్థో వార్డులోని ఎంఎన్‌ఓను బతిమలాడుకున్నారు.. తాను ఇంకా టిఫిన్ చేయలేదని ఎంఎన్‌ఓ పత్తా లేకుండా పోయారు. అందుబాటులో ఉన్న మరో ఎఫ్ఎన్ఓ తాను బరువు లాగలేనని తప్పించుకుంది. దీంతో కుటుంబ సభ్యులు చేసిది ఏమీ లేక రజియాభానును వారే ఆర్థో వార్డు నుంచి అతికష్టం మీద ఎక్స్‌రే గదికి తీసుకెళ్లారు. ఇది ఒక్క ఆర్థో వార్డులో మాత్రమే కాదు. ఆస్పత్రిలో చాలా వార్డుల్లో ఇలాంటి దయనీయమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు మేలుకుని చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

– అనంతపురం మెడికల్:

మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి



కృష్ణాష్టమి విశేషాలు తెలియజేస్తున్న ఇస్కాన్ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: అనంత ఇస్కాన్ వేదికగా అంగరంగ వైభవంగా సాగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఇస్కాన్ ఇన్‌చార్జ్ దామోదర గౌరంగ దాసు ప్రభు తెలియజేశారు. శుక్రవారం మందిర ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన కృష్ణాష్టమి వేడుకల వివరాలు వెల్లడించారు. 25న తెల్లవారుజామున ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 9:30 గంటలకు యజ్ఞసేవ, హరినామ సంకీర్తన, సాయంత్రం తులసి అర్చన, హనుమద్ వాహన సేవ, అనంతరం సాంస్కృతిక సంబరాలు, ఊంజల సేవ 26న ఉదయం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా దర్శన హారతి, గురుపూజ, సాయంత్రం ఉట్టికొట్టే సేవ, 5 గంటలకు గరుడవాహన సేవ, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రికి దీపోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు మహాపుష్పాభిషేకం , జరుగుతాయన్నారు. 27న ఇస్కాన్ వ్యవస్థాపకుడు ఆచార్య భక్తివేదాంత స్వామి శ్రీలప్రభుపాదుల వారి ఆవిర్భావం సందర్భంగా గురువుకు మహా అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన సేవ జరుగుతాయని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న జిల్లా నోడల్ మానసిక అధికారి విశ్వనాథ్



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూ(ఏ) అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ (ఓటీపీఆర్ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఓటీఆర్ఐ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు అలరించారు. ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య సుదర్శనరావు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసలు కారాదని పిలుపునిచ్చారు. వీటి వలన కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఓటీపీఆర్ఐ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పరిశోధనా సంస్థ సంచాలకులు ఆచార్య దుర్గాప్రసాద్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి స్వరూపా రాణి, ప్రిన్సిపాల్ గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆల్కహాల్, మాదక ద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలు ప్రమాదకరం. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా నోడల్ మానసిక అధికారి విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు, వాటి వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దన్నారు. సోషల్ మీడియా, గేమ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పరీక్షల ఒత్తిడి, ఆందోళన, నిరాశ, ఒంటరితనం, ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సబిహా సుల్తానా, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ పునఃప్రతిష్టాపనోత్సవాలు



పూజలందుకున్న విజయదుర్గ మాత

అనంతపురం కల్చరల్: మారుతీనగర్‌లో వెలసిన కోదండ రామాలయంలో మూడు రోజుల పాటూ సాగిన విజయ దుర్గాదేవి విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం అధ్యక్షురాలు జమునా విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు నాగరాజశర్మ ఆధ్వర్యంలో చక్రసహిత అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్టలను వేదపండితులు నిర్వహించారు. సప్తశతి హోమం, రుద్ర హోమాలు జరిగాయి. మధ్యాహ్నం నారాయణ సేవ, సాయంత్రం స్వామివారి సంకీర్తనామృతం జరిగింది. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి సామూహిక పూజలు నిర్వహించారు.

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే..

అనంతపురం కల్చరల్: శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తజనసంద్రాలుగా మారాయి. వాడవాడలా అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. నగరంలోని కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయాలు, రామనగర్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయం, శంకరమఠంలో శారదామాత, శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, శివకోటి తదితర చోట్ల పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. దేదీప్యమానంగా సాగిన హారతుల వెలుగుల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లను భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. సామూహిక కుంకుమార్చనలతో మొక్కులు తీర్చుకున్నారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట

కనగానపల్లి: మండలంలోని భానుకోట గ్రామంలో కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కొల్లాపురమ్మ శక్తి దేవాలయంలో వేదపండితుల చేత ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేశారు. అనంతరం అమ్మవారిని ఆభరణాలు, పూలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.